క్లుప్తంగా

వైభవంగా సరే పోలమ్మ జాతర

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో సరేపోలమ్మ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ సభ్యుడు సింహాచలం ఈ మేరకు మాట్లాడుతూ సరేపోలమ్మ అమ్మవారి జాతర బొబ్బిలి, గొల్లపల్లి, పాతబొబ్బిలి పట్టణాలతో పాటు లచ్చయ్యపేటలో ఒకే సారి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అమ్మవారి ఘటాలతో ఊరేగింపు నిర్వహించామని, బుధవారం ఉదయం అమ్మవారి అనుపోత్సవం జరుగుతుందని చెప్పారు.

23న వాహనాల వేలం

సీతానగరం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పట్టుబడిన 12 వాహనాలకు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వారి ఆధ్వర్యంలో పార్వతీపురం ఎస్‌ఈబీ కార్యాలయం ఆవరణలో ఈ నెల 23న వేలం వేయనున్నారు. వేలం పాటపై ఆసక్తి కలిగిన వారు ఆ రోజు ఉదయం హాజరు కావాలని సీతానగరం ఎస్‌ఈబీ సీఐ జె. శ్రీనివాసరావు కోరారు.

సేదదీరిన జనం

సాలూరు: భానుని తాపంతో విలవిల్లాడిన ప్రజలు మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో సేదదీరారు.ఈ వర్షం వల్ల మండలంలోని రైతులు పొలం పనులు ముమ్మరం చేసే పనిలో పడ్డారు. పొలాలకు దుక్కులు చేయడంతో పాటు విత్తనాల సేకరణకు సిద్ధమయ్యారు.

విరగకాసిన మునగ చెట్టు



సాలూరు రూరల్: మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ పునికినవలస గ్రామానికి చెందిన ఎం.కృష్ణ తోటలో విరగకాసిన మునగ చెట్టు గ్రామస్తులకు ఆకర్షిస్తోంది.

వర్షంతో ఉపశమనం



కురుపాంలో కురుస్తున్న వర్షం

కురుపాం: మండల కేంద్రం సహా మండల పరిధిలోని పలు గిరిజన గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. ఇన్నాళ్లు వేసవి ఎండల కారణంగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు ప్రస్తుతం కురిసిన వర్షానికి వాతావరణం కాస్త చల్లబడడంతో ఉపశమనం పొందారు. బుధవారం బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం 24వ తేదీకి వాయుగుండంగా మారే నేపథ్యంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతులు వ్యవసాయానికి సన్నద్ధమవుతున్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి, గవరమ్మపేట, రామినాయుడువలస తదితర గ్రామాల్లో మంగళవారం సాయత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వ్యవసాయానికి వర్షం ఉపకరిస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన ప్లంబింగ్ శిక్షణ



స్మార్ట్ ఫోన్‌లో ప్లంబింగ్ నైపుణ్య పరీక్ష రాస్తున్న శిక్షణార్థులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ రెసిడెన్షియల్ ఐటీఐలో ఏపీఎస్‌ఎస్‌డీసీ ద్వారా రెండు నెలలు ఇస్తున్న ప్లంబింగ్ శిక్షణ మంగళవారంతో ముగిసింది. శిక్షణార్థులకు స్మార్ట్‌ఫోన్‌లో శిక్షణకు సంబంధించిన నైపుణ్య పరీక్ష మధ్యాహ్నం నిర్వహించారు. పరీక్ష జరుగుతున్న తీరును పార్వతీపురం ఏపీ టెక్‌కు చెందిన వి.సుధీర్ పర్యవేక్షించారు. శిక్షణ పొందిన ప్రతిఒక్కరూ ప్లంబింగ్ పనులు చేసుకుని, ఉపాధి మెరుగుపరుచుకోవాలని ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ కోరారు.

ఇసుక రీచ్ పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు వద్ద ఉన్న ఇసుక రీచ్‌ను తహసీల్దారు సీతారామయ్య మంగళవారం పరిశీలించారు. రీచ్‌లో ఉన్న ప్రస్తుత స్థితిగతులను ఆయన క్షుణ్ణంగా చూసి, ఎటువంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట చినమేరంగి ఎస్‌ఐ డి.చిన్నంనాయుడు, వీఆర్‌వో చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

జోరుగా ఉపాధి పనులు

- గ్రామీణులను ఆదుకుంటున్న పథకం

సాలూరు రూరల్:

మండలంలో ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఏ గ్రామంలో చూసినా ఉదయం 6 గంటల సమయం అయ్యేసరికి ఉపాధి కూలీలు ఇంటికి ఒకరిద్దరు చొప్పున పనిముట్లను పట్టుకుని బయల్దేరుతున్నారు. 6 గంటలకే ఇంటి పనులు ముగించుకుని ఉపాధి పనులు చేసేందుకు వెళ్తుంటే గతంలో వ్యవసాయం చేసే రైతులు తెలవారు జామున లేచి తమ కాడితో వేకువజామున నడిచిన రోజులు గుర్తుకు వస్తున్నాయి. ఇప్పుడు యంత్రాలతో వ్యవసాయం చేస్తున్న రోజులు కావడంతో గతంలో పొలానికి వెళ్లే రైతుల సమయ పాలనకు ఇప్పటి రైతుల సమయ పాలనకు వ్యత్యాసం కనిపిస్తోంది. ఎండలు మండుతుండడంతో ఉదయం 6గంటల లోపే పని ప్రదేశాల్లో ఉండాలని ఉపాధి హామీ అధికారులు కూలీలకు ఆదేశాలతో ఇంటి వద్ద 5.30 గంటలకే బయలుదేరాల్సి వస్తోంది. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో పని ప్రదేశాల్లో పందిళ్లు వేయడం, పరదాలు కట్టి వారికి మంచినీరు మజ్జిగ సైతం ఉపాధి సిబ్బంది అందుబాటులో ఉంచుతున్నారు. ప్రతి ఇంటికి 100 రోజులు పనిదినాలకు తగ్గట్టుగా జాబ్‌కార్డులు అందజేశారు. మండలంలో 17,118 జాబ్‌కార్డులు మంజూరు చేయగా ప్రస్తుతం 16,709 జాబ్ కార్డులు ఏక్టివ్‌లో ఉన్నాయి. 2024–2025 సంవత్సరానికి గాను 12లక్షల 47 వేల 603 పనిదినాలు బడ్జెట్ లో ఉండగా ప్రస్తుతం మే 21 నాటికి 4లక్షల 51 వేల 35 రోజులు అధికారుల లెక్కల ప్రకారం పూరికావచ్చాయి. ఇంకా మిగిలిన పనిదినాలు 2025 మార్చి 31 నాటి వరకు వాతావరణం అనుకూలతను బట్టి కొనసాగుతాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం 13,426 మంది ఉపాధి కూలీలు ఫీల్డ్‌లో పనిచేస్తున్నారు. గ్రామాలలో ప్రజలను ప్రభుత్వం అన్నివిధాలా సంక్షేమ పథకాలతో ఆదుకోవడంతో పాటు వేసవి కాలంలో ఉపాధి పనులతో ప్రతి ఇంటిలో ప్రభుత్వం వెలుగులు నింపుతోంది. వ్యవసాయ పనులు మొదలు పెట్టే సమయం వరకు చిన్న సన్నకారు రైతుకుటుంబాలతో పాటు వ్యవసాయ కూలిపైనే పూర్తిగా ఆధారపడి జీవిస్తున్న గ్రామీణ ప్రజలకు ఉపాధి పనులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.



చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పనే ధ్యేయం



ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి పని కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నాం. ఇప్పటివరకు 3 విడతలుగా పేమెంట్లు విడుదల చేశాం. కూలీలకు పని ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రస్తుతం అమృత సరోవర్, ఇంకుడు గుంతల పథకాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. వాటి ద్వారా వర్షపునీటిని నిల్వ ఉంచడం ప్రధాన లక్ష్యం. ప్రతి కూలీ నాలుగు గంటలు పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. అలాగే వేతనం రూ.300 వచ్చేలా ప్రయత్నం చేస్తున్నాం. అయితే ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రతికూలీకి ప్రస్తుతం రూ.242 పనిని బట్టి చెల్లించాల్సి వస్తోంది. జాబ్‌కార్డు ఉండి 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులను పండ్ల మొక్కల పెంపకానికి ప్రోత్సహిస్తున్నాం. ఉపాధి కూలీలకు అన్నివిధాలా సహకరించే విధంగా సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్నాం.

– టి.రామకృష్ణ నాయుడు, ఏపీఓ

జబ్బువాపు వ్యాధి నివారణకు టీకాలు



మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు

సీతానగరం: సీతాకాలంలో పశువులకు వచ్చే జబ్బువాపు వ్యాధి నివారణకు రైతులకు అవగాహన కల్పిస్తూ జబ్బువాపు వ్యాధి నివారణకు ముందు జాగ్రత్తచర్యగా సిబ్బంది సహకారంతో టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి ఎస్.రామారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలపశు వైద్య కేంద్రంలో వీఎల్‌ఓలు, పశు వైద్య సహాయకులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతాకాలంలో గొర్రెలు మేకలు వివిధ రకాల వ్యాధుల బారిన పడే ఆస్కారం ఉన్నందున వ్యాధి నివారణకు ముందుజాగ్రత్తచర్యగా ఉచిత పశువైద్యశిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నేపథ్యంలో పశువుల్లో జబ్బువాపు వ్యాధి సోకుతుందని ముందుజాగ్రత్తచర్యగా ప్రభుత్వం వ్యాధినిరోధక టీకాలు పంపిణీ చేయడంతో 1620 పెద్ద పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు. అలాగే ఇదే సీజన్‌లో గొర్రెలు, మేకలను ఆశించే చిటిక వ్యాధినివారణకు 12,500 గొర్రెలు, మేకలకు టీకాలు వేసినట్లు తెలిపారు. పశువులు, గొర్రెలు మేకలకు వ్యాధినిరోధక టీకాలు వేయడానికి గ్రామాలకు వస్తున్న పశువైద్యులకు రైతులు, గొర్రెలు, మేకల కాపరులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వీఎల్‌ఓలు సంజీవినాయుడు, స్వర్ణలత, చంద్రశేఖర్, పార్వతి, రైతుభరోసా కేంద్రం పశువైద్య సహాయకులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సువర్ణముఖి నదిలో ఇసుక రీచ్‌ల పరిశీలన



బూర్జ రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ కె.హేమలత



సీతానగరం రీచ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మండలంలోని సువర్ణముఖి ప్రాంతంలో ఉన్న ఇసుక రీచ్‌లనుంచి అక్రమంగా ఇసుక తరలించడం చట్టరీత్యా నేరమని ఆర్డీఓ కె హేమలత అన్నారు. ఈ మేరకు మండలంలోని బూర్జ రేవులో ఉన్న ఇసుక రీచ్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనధికారికంగా రీచ్‌లనుంచి ఇసుక తరలించడం నేరమని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే సీతానగరంలోని పంచముఖేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌ను తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎస్సై ఎం.రాజేష్ పరిశీలించారు. రీచ్‌లో ఇసుక నిల్వలు, రహదారిని తనిఖీ చేశారు. పరిశీలన అనంతరం పార్వతీపురం ఆర్డీఓ కె హేమలత ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నాగిరెడ్డి శ్రీనివాసరావు, వీఆర్వోలు పి. కుమార్‌నాయుడు, దామోదరనాయుడు పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: మండలంలో అనధికారికంగా నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌లను తహసీల్దార్ జనార్దన్, ఎస్సై పాపారావులు మంగళవారం పరిశీలించారు. మండలంలో అనధికారిక ఇసుక రీచ్‌లు నిర్వహిస్తూ అక్రమంగా ఇసుక తరలించేవారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై పాపారావు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఎవరికైనా ఇసుక అవసరమైతే అందుకు తహసీల్దార్ నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు ఇకపై అక్రమంగా తరలించేవారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



బలిజిపేట: వంతరాంలో ఇసుకరీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఎంఎఫ్7 రికార్డు పక్కాగా నిర్వహించాలి

- డీఎంఓ డాక్టర్ టి.జగన్ మోహనరావు

పార్వతీపురంటౌన్: ఎంఎఫ్7 రికార్డు పక్కాగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు అన్నారు. ఈ మేరకు జిల్లా ఆస్పత్రిలో మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షా కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతిరోజూ నిర్వహిస్తున్న మలేరియా, డెంగీ జ్వర నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికల వివరాలపై ఆరా తీశారు. మలేరియా నిర్ధారణకు మైక్రోస్కోప్ పరీక్షా విధానాన్ని ఎక్కువగా అవలంబించాలని ఆదేశించారు. సేకరించిన రక్త పూతల స్లైడ్స్‌ను పరిశీలించారు.

కచ్చితమైన ఫలితాల కోసం స్లైడ్స్‌ను సకాలంలో పరీక్ష చేయాలని చెప్పారు. డెంగీ నిర్ధారణ పరీక్షా పరికరం (ఎలీసా రీడర్) పనిచేస్తున్న తీరును పరిశీలించారు. క్షేత్ర స్థాయి నుంచి డెంగీ తుది నిర్ధారణ కోసం నమూనాలు ఏ మేరకు వస్తున్నాయని ఆరా తీశారు. మలేరియా, డెంగీ నిర్ధారణ అయితే వెంటనే ఐహెచ్ఐపీలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం అక్కడ ల్యాబ్‌లో ట్రైనీ సిబ్బందికి జ్వర నిర్ధారణ పరీక్షలు, మలేరియా, డెంగీ జ్వర లక్షణాలు తదితర అంశాలపై వివరించారు. ఆయన వెంట ఏఎంఓ సూర్యనారాయణ ఉన్నారు.



పట్టణంలో మలేరియా, డెంగీ నిర్ధారణ కేంద్రాల్లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్ మోహనరావు

కొండాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగులకు వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో నెలకు రెండు సార్లు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలందిస్తున్నామని, రోగులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఎన్‌ఎం కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఆశా వర్కర్లు సేవలందించారు.



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ కమలనాథ్

పచ్చిరొట్ట సాగుతో
భూసారం వృద్ధి



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న ఏడీఏ రత్నకుమారి, ఏఓ సౌజన్య

వీరఘట్టం: ఖరీఫ్ దుక్కులకు 40 రోజుల ముందుగా పచ్చిరొట్ట విత్తనాలను పొలంలో వేయడం ద్వారా భూసారం వృద్ధి చెందుతుందని పాలకొండ వ్యవసాయశాఖ ఏడీఏ రత్నకుమారి సూచించారు. మండలంలోని పనసనందివాడ ఆర్‌బీకేలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. భూసారం పెంపొందించేందుకు చేట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం 50 శాతం సబ్సిడీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ప్రస్తుతం మండలంలోని 24 రైతుభరోసా కేంద్రాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు వెంటనే తీసుకోవాలని సూచించారు. ఆమెతో పాటు మండల వ్యవసాయశాఖ అధికారి జె.సౌజన్య ఉన్నారు.

బిల్లులు చెల్లించేలా చొరవ చూపండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు

పాలకొండ రూరల్: ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో అధికారుల ఆదేశాల మేరకు అద్దె ప్రాతిపదికన వినియోగించిన ప్రైవేటు వాహనాలకు సంబంధించి బిల్లులు చెల్లించేలా చొరవ చూపాలని వాహన చోదకులు, యజమానులు కోరారు. పాలకొండ తహసీల్దార్ వరహాలను మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి తమ సమస్యలను వివరించారు. అధికారుల సూచనలతో అవసరం మేరకు ఇతర ప్రాంతాల నుంచి కొన్ని వాహనాలను, చోదకులను తీసుకువచ్చినట్లు ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వేతనదారులకు, వాహనాల ఫైనాన్స్ సిబ్బందికి నగదు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో బిల్లులు అందించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ.. మీ సమస్యను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ద్వారా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి బిల్లుల చెల్లింపునకు కృషిచేస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గరుగుబిల్లి: మండలంలోని గిజబ నిర్వాసిత గ్రామంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. ఇదే విషయమై మంగళవా రం విలేకరులతో మాట్లాడిన ఆమె.. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించి, పక్కా భవనం నిర్మాణానికి నిధులు మంజూరై ఐదేళ్లు గడిచినా ఇంతవరకు నిర్మాణ పనులు పూర్తి కాలేదన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా కొన్ని వీధుల్లోనే ఇంటింటికీ కుళాయిలు ఏర్పా టు చేశారని, మిగిలిన వీధుల్లో కుళాయిలు ఏర్పాటు చేయలేదని తెలిపారు. అలాగే సీసీ రోడ్లు, కాలువలు మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తక్షణమే గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

జీవాలు జాగ్రత్త

- ఈ సీజన్‌లో గొర్రెల్లో కాలిపుండు వ్యాధి ప్రబలే అవకాశం
- ముందుగా గుర్తించకుంటే.. మందలో మిగిలిన జీవాలకు వ్యాప్తి
- పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్య సిబ్బంది



పాలకొండ రూరల్: వేసవిలో అడపాదడపా కురేసే వర్షాలతో జీవాల్లో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉందని, జీవాల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి బి.సిద్ధార్థ సూచించారు. వాతావరణంలో మార్పుల కారణంగా గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదముందని అన్నారు. మేతకు వెళ్లే గొర్రెల మందలు వర్షాల్లో తడవటం, మురికి కుంటల్లో, నిల్వ ఉన్న నీటిలో అధిక సమయం నిలిచి ఉండటంతో సూక్ష్మజీవులు వాటి కాళ్లపైకి చేరుతాయి. ఈ సూక్ష్మజీవుల కారణంగా గొర్రెలు వ్యాధుల బారిన పడతాయి. అలాగే చిత్తడి నేలల్లో తిరగటం వలన వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించి సరైన చర్యలు తీసుకోకపోతే మందలోని మిగతా వాటికి వ్యాధి వ్యాపిస్తుంది.

వ్యాధి లక్షణాలు..

కాలిపుండు వ్యాధి సోకిన గొర్రెలు సరిగా నడవలేక ఇబ్బందులు పడతాయి. అలాంటప్పుడు వాటి గిట్టలను పరిశీలించాలి. గిట్టల మధ్య ఎర్రగా కందినట్లు ఉంటే కాలిపుండు వచ్చినట్లు గుర్తించాలి. ఈ వ్యాధి సోకిన జీవాలు సరిగా మేత మేయవు. బరువు తగ్గుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పడుతుంది. అలాగే తీవ్రమైన చెడువాసన వస్తుంది. వ్యాధి తీవ్రత కారణంగా కాళ్ల గిట్టలు ఊడిపోయే ప్రమాదం ఉంది.

చికిత్స ఇలా..

ఈ తరహా వ్యాధి లక్షణాలు గుర్తిస్తే తక్షణమే స్పందించాలి. వ్యాధి సోకిన ప్రదేశంలో గిట్టలకు 10 శాతం మైలతుత్తము ద్రావణంలో లేదా 10 శాతం జింక్ సల్ఫేట్ ద్రావణంలో లేదా 5 శాతం ఫార్మాలిన్ ద్రావణంలో నడిపించాలి. తద్వారా వాటి కాళ్లను పట్టిఉన్న క్రిములను శుభ్రం చేయవచ్చు. ఇలా రోజుకు రెండు సార్లు చేయటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వైద్యుల సూచనల మేరకు యాంటీ బయాటిక్ మందులను దాదాపు 30 రోజులు వరకు పూతపూయాలి. అదనంగా పెరిగిన గిట్టలను కత్తిరించాలి. ఈ వ్యాధి మందలోని ఇతర జీవాలకు వ్యాపించకుండా ఉండేందుకు వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరుచేయాలి. గొర్రెలను చిత్తడి, నీరు నిలిచిన ప్రదేశాలకు దూరంగా ఉంచాలి. మందలను పెంచే ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత కల్పించాలి. వైద్యుల సూచనలు తప్పక పాటించటం ద్వారా జీవాలు రోగాల బారిన పడకుండా సంరక్షించొచ్చు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



కోమటిపేట అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్య భద్రత, రక్షణ పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ పాలకొండ సెక్టార్ సూపర్‌వైజర్ దశారత్నం అన్నారు. పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మంగళవారం ఆమె తనిఖీ చేశారు. కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, చిన్నారుల ఆరోగ్య వివరాలను పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలకు కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వేసవి నేపథ్యంలో కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి

- ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి

కొమరాడ:

ప్రజాసమస్యలు, వాటి పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ శెట్టి శ్యామ ల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ ఏడాది త్వరగా వస్తున్న రుతుపవనాలు వ్యవసాయానికి అనుకూలమని, ఈ నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. అలాగే వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలన్నారు. వీటితో ప్రతీ గ్రామంలో గ్రామస్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభివృద్ధి పనులు, పథకాల అమలు వంటి అంశాలపై సభ్యులు చర్చించకపోవడం గమనార్హం. సమావేశంలో వైస్ ఎంపీపీలు నంగిరెడ్డి శరత్‌బాబు, కేంద్రక అన్నపూర్ణ, ఎంపీడీవో మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి శ్యామల

మట్టిబొమ్మల తయారీలో మెలకువలు

పాలకొండ రూరల్:

స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం మట్టితో బొమ్మలు, వివిధ రకాల కళాకృతుల తయారీపై డ్రాయింగ్ టీచర్ జి.మురళి శిక్షణ ఇచ్చారు. మట్టితో బొజ్జ గణపతి ప్రతిమలు తయారు చేసేందుకు విద్యార్థులు ఉత్సుకత చూపించారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కె.జనార్దనరావు తెలుగు భాష మాధుర్యం, పద్యాలు వాటి తాత్పర్యాలను విద్యార్థులకు వివరించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని పిల్లలకు సూచించారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు, సహాయకులు ఈశ్వరరావు, తదితరులున్నారు.



మట్టి బొమ్మల తయారీలో నిమగ్నమైన విద్యార్థులు